కాలం కరుగుతున్నా..

వ్యవసాయం శూన్యం

నమ్మించి నట్టేట ముంచడంలో మరోసారి చంద్రబాబు తన నైజాన్ని చాటుకున్నాడు. అన్నదాతలకు అండగా నిలుస్తామని ఎన్నికల ముందు ఉపన్యాసాలతో ఊదరగొట్టిన ఆయన నేడు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. గత ఏడాది అన్నదాత సుఖీభవ సాయం ఎగ్గొట్టారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వర్షాలు సక్రమంగా కురిసి, అదను దాటి పోతున్నా పెట్టుబడి సాయం అందించ లేదు. దీంతో వ్యవసాయం శూన్యం అయ్యే పరిస్థితి నెలకొంది.

- కూటమి ప్రభుత్వంలో రైతన్నకు మొండిచేయి
- అదను దాటిపోతున్నా అందని అన్నదాత సుఖీభవ
- గతంలో సకాలంలో భరోసా ఇచ్చిన వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం
- చిల్లిగవ్వ లేక అప్పుల కోసం రైతుల పాట్లు


పొలాన్ని దుక్కిదున్నుతున్న రైతు

బుచ్చినాయుడుకండ్రిగ: అధికారంలోకి రావాలన్న తపనతో కూటమి నాయకులు అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించారు. పాలన పగ్గాలు చేపట్టిన తరువాత రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవగా పేరు మార్చారు. కూటమి సర్కారు గద్దెనెక్కి ఏడాది గడిచినా రైతులకు రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. సంవత్సరానికి రూ.20 వేలు పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి అదిగో... ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప.. పథకం అమలులో స్పష్టత కొరవడింది. ఖరీఫ్ పంటల సాగుకు కర్షకుల వద్ద సొమ్ములు లేక అప్పులు చేస్తున్నారు. కూటమి నాయకుల మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో సకాలంలో రైతు భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో ఖరీఫ్ సాగు మొదలుకాక ముందే ఆర్థికసాయం అందజేయడంతో ఐదేళ్లపాటు వ్యవసాయం పండుగలా సాగింది. నాడు ఏటా రైతులకు రూ.13,500 అందేది. కూటమి పెద్దలు ఎన్నికల ముందు రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా.. ఇప్పటి వరకు కనీసం సాయం అందించకపోవడంతో ప్రస్తుతం పంట సాగుకు పెట్టుబడి కోసం చేతిలో చిల్లిగవ్వ లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు.

కౌలు రైతులకు దక్కని భరోసా

భూమి లేని రైతులు కౌలుకు భూములను సాగు చేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అందించింది. అయితే నేడు అవేవీ అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకాలన్నింటికీ దూరమై గగ్గోలు పెడుతున్నారు.

అదిగో...ఇదిగో... అంటూ కాలయాపన

మండలంలో ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తుండంతోపాటు తెలుగుగంగ నీరు చెరువులకు చేరడంతో రైతులు సాగుకు పూనుకుంటున్నారు. మండలంలో 9 వేల ఎకరాల్లో 7,900 మంది రైతులు పంట సాగు చేస్తున్నారు. వారికి ప్రస్తుతం వ్యవసాయానికి ఎరువులు, మందులు, కూలీల ఖర్చులకు నగదు అవసరం అవుతోంది. గతంలో రైతులకు ఇస్తున్న రైతుభరోసా పథకానికి కూటమి సర్కారు పేరు మార్చి అన్నదాత సుఖీభవ పథకం అని నామకరణం చేసిందే తప్ప, దాన్ని అమలు చేయడంలో స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా నేటి వరకు విధి విధానాలు వెల్లడించకపోవడం చూస్తే పాలకుల చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతుంది. జూన్ 20వ తేదీన అని ఒకరు, కాదు 21వ తేదీన అన్ని సీఎం చంద్రబాబు పలుమార్లు ప్రకటించినప్పటికీ జూలై 25వ తేదీ గడిచినా రైతుల ఖాతాల్లో పథకం సొమ్ము జమ కాలేదు. అసలు ఈ పథకం అమలు చేసే ఉద్దేశం ఉందా లేదా? అన్న సమాచారం కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడం, అంతంతమాత్రంగానే దిగుబడులు రావడంతో రైతుల చేతిలో చిల్లిగవ్వ లేక పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది.

జూన్‌లో ఇస్తామన్నారు!



అన్నదాత సుఖీభవ ఏడాది నుంచి ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదు. జూన్ 20వ తేదీ అన్నారు. లేదు మళ్లీ 21వ తేదీ అన్నారు. ఇంత వరకు ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో స్పష్టత లేదు. గత ఏడాది ఇవ్వలేదు. ఈ ఏడాదైన రబీ సీజన్‌లో పంట సాగు చేసుకోవడానికి అమలు చేస్తారా? లేదా అనే అనుమానం ఉంది. ఇప్పటికే కొంత మంది రైతులు అప్పులు దొరక్క అన్నదాత సుఖీభవ నగదు కోసం ఎదురు చూస్తున్నారు. పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

– దయాకర్‌రెడ్డి, రైతు, కనమనంబేడు గ్రామం

ఇంకెప్పుడు ఇస్తారు?



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నేటి వరకు వాటి గురించి ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదు. ఇప్పటికే ముందస్తు వర్షాలతో కొంతమంది రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేసుకుంటున్నాం. ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నాయకులు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి, రైతులనుఆదుకోవాలి.

– కృష్ణారెడ్డి, రైతు, బీఎస్‌కండ్రిగ

క్లుప్తంగా

మహాకవి గుర్రం జాషువా


పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఆధునిక సాహిత్యంలో పదునైన రచనల ద్వారా సమాజంలోని దురాచారాలను ప్రశ్నించి, ఆలోచింపజేసిన మహాకవి గుర్రం జాషువా అని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీమురళి అన్నారు. గురువారం కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా వర్ధంతి నిర్వహించారు. హెచ్ఎం వాణి, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, నాదెండ్ల మురళి, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, సుజన, దాసు పాల్గొన్నారు.

లక్ష్యంపై దృష్టి సారించాలి

తొట్టంబేడు: విద్యార్థులు లక్ష్యంపై దృష్టి సారించాలని శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని గవర్నమెంట్ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ కోరాడ దుర్గారావు, ఎం.జఫరుల్లా బేగ్, జి.విజయసారథి, పి.మనోహర్, ఎన్.గిరిప్రసాద్, కె. చంద్రశేఖర్ రెడ్డి, ఎల్.రాధ, కె.గుణవతి, ఎం.మహిత, కె. విజయప్రియ, ఎస్. సుధారాణి, కందాటి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో ఉన్న అంకాలమ్మ ఆలయం వద్ద గురువారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. యశ్వంత్రెవ, జయగణేష్, బాలాజీరావు, రాజశేఖర్, డాక్టర్ కృపానిధి, లోకేష్యదవ్,అరుణ్, శివప్రసాద్, దినకర్, రామారెడ్డి, గోపి, సత్యనారాయణరావు, వెంకటసుబ్బయ్య, రష్మిత, కుమారి, సుబ్రాయ కామత్, చక్రధర్, రాహుల్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా



నాగలాపురం: పుత్తూరు–చెన్నై హైవేపై ఓ ఆటో బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు..సత్యవేడు నుంచి ఓ ఆటో గురువారం యూరియా బస్తాలను లోడ్ చేసుకుని పిచ్చాటూరుకు బయలుదేరింది. మార్గం మధ్యలో నాగలాపురం బైపాస్‌లో ఉన్న ఫైవ్ స్టార్ వైన్ షాపు వద్ద ఆటో టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు.

జాబితా సిద్ధం చేయాలి

సత్యవేడు: బూత్ లెవల్ అసిస్టెంట్ల ఓటరు జాబితాను తరిత్వగతిన సిద్ధం చేయాలని తహసీల్దార్ రాజశేఖర్ కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలు ఓటర్ జాబితా వంటి పలు అంశాలపై వివిధ పార్టీ నాయకులతో చర్చించారు. ఓటర్ల సంఖ్య 1200 దాటిన పోలింగ్ కేంద్రాలను అదనంగా మరో కేంద్రంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆగస్టులో మరోసారి ఇంటి ఇంటి సర్వే ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్ రెడ్డి , శ్రీధర్ రెడ్డి, టీడీపీ నేత నరేంద్ర రెడ్డి, సీపీఎం నాయకుడు రమేష్, డీటీ వెంకటేష్ , ఆర్ఐ సురేష్, మాధురి పాల్గొన్నారు.

కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి చేస్తా

శ్రీకాళహస్తి: ప్రభుత్వాస్పత్రిని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి కమిటీని ఏ ర్పాటు చేశారు. కమిటీ సమావేశం నిర్వహించి, ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం అశ్రత ఇన్‌ఫ్రా అధినేత డీవీఎస్ శ్రీధర్‌వర్మ రూ.5 లక్షలు విలువ చేసే పరికరాలను ఆస్పత్రికి అందజేశారు.

టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం

సమావేశం సందర్భంగా టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గత ప్రభుత్వంలో రూ.12 కోట్లతో అభివృద్ధి పనుల శిలాఫలకాలను తొలగించారు. దీనిపై అధికారులు, ఎమ్మెల్యే పెదవి విప్పకకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

8న వరలక్ష్మి వ్రతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆగస్టు 8వ తేదీన సామూహిక వరలక్ష్మీవ్రతం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి వ్రతం ప్రారంభం అవుతుందన్నారు. పట్టణంలోని ముత్తైదువులు వ్రతంలో పాల్గొని నిర్వహించుకోవాలన్నారు.

నివాళి

శ్రీకాళహస్తి: ప్రముఖ న్యాయవాది గౌస్ బాషా సోదరుడు షేక్ బాబు గురువారం ఆకస్మిక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫతాన్ ఫరీద్, గోరా, గఫూర్, ఫజల్, అస్లాం, షేక్ బాబు, గౌస్‌బాషా, షేక్‌జుంలేషా తదితరులు పాల్గొన్నారు.

భూమనకు సత్కారం


భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న రాజేష్, బీరేంద్రవర్మ

తిరుపతి మంగళం : పద్మావతిపురంలోని భూమన నివాసంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డిని గురువారం సత్యవేడు సమన్వయకర్త నూకతోట రాజేష్, పార్టీ నాయకులు బీరేంద్ర వర్మ మర్యాదపూర్వకంగా కలసి శాలువ కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

తిరుచ్చిపై ఆండాళ్ అమ్మవారు


తిరుచ్చి వాహనంపై ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తిరుచ్చి వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. తిరువాడిపుర ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఆండాళ్(గోదాదేవి)కి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన అమ్మవారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆండాళ్ అమ్మవారికి ఆస్థానం నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలను ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు తదితరులు పర్యవేక్షించారు.

అధికారం కోసమే అబద్ధపు హామీలు

- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్


రీ కాల్ బాబూ మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్, నేతలు

కేవీబీపురం: అధికారంలోకి రావడమే లక్ష్యంగా 2024 ఎన్నికల్లో బాబు అబద్ధపు హామీలు ఇచ్చారని, ఆ భూటకపు మాటలను నమ్మి, రాష్ట్ర ప్రజలు మోసపోయారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. కేవీబీపురం మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య అధ్యక్షతన మండల కేంద్రంలో గురువారం జరిగిన రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్యూఆర్‌కోడ్‌ను ఆయన నాయకుల సమక్ష్యంలో ఆవిష్కరించి, దానిపై కార్యకర్తలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో 20 శాతం కూడా అమలు చేయలేకపోయారన్నారు. రాష్ట్ర ప్రజలకు బాబుగారి పాలనలో ఒరిగిందేమి లేదని, మహిళలకు రూ.1500 ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను ప్రజలకు వినిపిస్తూ, ఇక అన్నీ పథకాలను అమలు చేయాలంటే మోడీతో కలుసుకుని దేశాన్ని అమ్మేస్తారా? అని ఎద్దేవా చేశారు.

సంక్షేమ చక్రవర్తి వైఎస్ జగన్

2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 90 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని నూకతోటి రాజేష్ అన్నారు. ప్రజలకు జగనన్న ఇచ్చిన హామీలతోపాటు, మేనిఫెస్టోలో చెప్పని అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి ప్రజా సంక్షేమానికి, మహిళల ఆర్థిక భరోసాకు పెద్దపీట వేసి, జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ చక్రవర్తిగా మారారని ఆయన చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నించిన తమ నేతలపై తప్పుడు కేసులు పెట్టి, జైలుకు పంపుతున్నారన్నారు. ప్రసుత్తం కూటమి పాలన చూస్తుంటే వేధింపులే అభివృద్ధి, తప్పుడు కేసులే సంక్షేమంలా ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు తేరణి ధనుంజయరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, జిల్లా ఆర్‌టీఐ వింగ్ సభ్యులు జగదీష్, లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు లాయర్ ప్రసాదరెడ్డి, మండల నేతలు చందురెడ్డి, నందకుమార్, కోవనూర్ మురళీరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అయ్యప్ప, సర్పంచ్ గిరి, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి జాకీర్, దేవళ్ల మణి, శాస్త్రిరాజు, గాలి దయాకర్ నాయుడు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత


తల్లిదండ్రులతో బాలుడు

శ్రీకాళహస్తి: సెల్‌ఫోన్ కొని ఇవ్వలేదని 15 రోజుల క్రితం ఇంటి పారిపోయిన కిరణ్(15)ను పోలీసులు గురువారం అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. డోన్‌కు చెందిన కిరణ్ అనే బాలుడు సెల్‌ఫోన్ కొని ఇవ్వలేదన్న కోపంతో ఇంటి నుంచి 15 రోజుల క్రితం వచ్చేశాడు. రెండు రోజుల క్రితం అదిలాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఓ టీవీ రిపోర్టర్ గుర్తించి, అతడి వద్ద వివరాలు ఆరా తీసింది. దీంతో శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు గురువారం అప్పగించాడు. పోలీసులు విచారణ జరిపి డోన్‌కు చెందిన బాలుడిగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, వారిని పిలిపించి, విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించారు.

వైభవం.. వసంతోత్సవం


పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు


పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామివారికి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ వద్ద ఉన్న వసంత మండపం వద్దకు స్వామి అమ్మవార్లను వేంచేపు చేశారు. శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామికి చందనం, క్షీర, పెరుగు, పసుపు, కుంకుమ, నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం, ధ్వజావరోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఎంపీ అరెస్టు కక్ష సాధింపు చర్యలో భాగమే


పిచ్చాటూరులో నిరసన చేస్తున్న మండల నాయికులు, కార్యకర్తలు

నాగలాపురం: మద్యం కేసులో మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి, రాక్షస ఆనందం పొందుతున్నారని వైఎస్సార్ సీపీ పిచ్చాటూరు మండల మాజీ అధ్యక్షుడు కె.టి.హరిచంద్రారెడ్డి ఆరోపించారు. మిథున్ రెడ్డిని అరెస్టును నిరసిస్తూ గురువారం పార్టీ మాజీ అధ్యక్షుడు హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల నేతలతో కలిసి పిచ్చాటూరు బైపాస్‌రోడ్డు వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మొదట వైఎస్సార్ విగహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం హేయమైన చర్య అని, ఇది కూటమి ప్రభుత్వం కుట్ర పూరిత, కక్ష పూరిత రాజకీయంలో భాగమేనని అన్నారు. కూటమి ప్రభు త్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రెడ్‌బుక్ రా జ్యాంగ వ్యవహరిస్తున్నారని, మిథున్ రెడ్డిపై మోసి న లిక్కర్ స్కామ్ అనేది వట్టి అభూతకల్పన, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వస్తు న్న జనాధరణ చూసి, ఓర్వలేక ఆయన్ని బలహీన పరిచేందుకు తప్పుడు కేసులు వేసి కుట్ర పన్నుతున్నారన్నారు. ఇప్పటివరకు మద్యం అక్రమ కేసులో అరెస్టు చేసిన తమ పార్టీ నేతలపై ఎలాంటి ఆధారాలు చూపలేదన్నారు. సర్పంచ్ రోసిరెడ్డి, భూపతి, రాజ ఎంపీటీసీ సభ్యుడు శేషన్, కేఆర్ వేలు, నాయకులు మునిరాజ్, గోవింద్, ప్రతాప్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, పాండియన్, మురళి, మనోహర్, సు బ్రమణ్యం రెడ్డి, సురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కరస్పాండెంట్లు

శ్రీకాళహస్తి: ప్రైవేటు పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని గురువారం ఎంఈఓ బాలయ్యకు శ్రీకాళహస్తి ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు బకాయిలు ఉన్న విద్యార్థుల వివరాలను ప్రభుత్వ పాఠశాలల లాగిన్లకు అనధికారకంగా ముట్టజెప్పడం జరుగుతోందన్నారు. విద్యార్థులు పూర్తిగా ఫీజుల చెల్లించకుండా మారడంతో ప్రైవేటు పాఠశాలలకు నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకునేలా చూడాలన్నారు. ఎంఈఓ బాలయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయంలో సెక్రటరీ జనరల్


గుడిమల్లం ఆలయంలో ప్రసన్న కుమార్ సూర్యదేవర

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో ఉన్న పరశురామేశ్వరస్వామివారిని గురువారం రాష్ట్ర లెజిస్లేటివ్ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్ర రెడ్డి ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం


కలశ పూజలు చేస్తున్న వేద పండితులు


ధ్వజావరోహణం పూజలు చేస్తున్న అర్చకులు


పురవీధుల్లో ఊరేగుతున్న కుమారస్వామి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా గురువారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. దీంతో ఆడికృత్తిక ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టుకు విశేష స్పందన


క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న స్విమ్స్ వైద్యులు

నారాయణవనం: తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం నారాయణవనం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించింది. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు మహిళలకు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి నాగరాజ్, మెడికల్ ఆఫీసర్ హరిత, పీహెచ్‌సీ డాక్టర్ రాగసుధ, సీహెచ్ఓ హరినాథ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీవల్లి, సూపర్‌వైజర్లు యశోదరమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.